

# చిన్నన్న.. నారాజ్!



- రెండు రోజుల కిందట గన్‌మెన్లు, ప్రభుత్వ వాహనం సరెండర్
- సొంత వాహనంలోనే ప్రభుత్వ, వ్యక్తిగత కార్యక్రమాలకు హాజరు
- గన్‌మెన్లను వదులుకోవడం గతంలోనూ ఆయనకు అలవాటే..
- పార్టీ పదవుల విషయంలో నారాజ్ అయ్యారని జోరుగా ప్రచారం
- క్రమశిక్షణ, సంస్థాగత పదవులు, నియోజకవర్గంలో పట్టు కోసమేనా?

**తానొవ్వక.. ఒకరిని నొప్పించక...** తన పని తాను చేసుకుంటూ వెళ్లే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డికి కోపం వచ్చినట్లుంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఆయన అంత సులభంగా తన అసంతృప్తిని బయటపెట్టరు. పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టకుండానే తన అసంతృప్తిని వెల్లడిస్తుంటారు. ప్రత్యక్షంగా అధిష్ఠానంతో విన్నవించుకోవడం ద్వారా గానీ, లేదా తన చర్యల ద్వారాగానీ అది కనిపిస్తుంటుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టు ద్వారా వచ్చిన కారు, గన్‌మెన్లను తిప్పి పంపించారు. ఈ చర్య వనపర్తి నియోజకవర్గంలోని రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమైంది. ఇది దేనికి సంకేతమో తెలియడం లేదు. ప్రభుత్వ పదవుల్లో ఉన్న పలుమార్లు ఇలా జరిగింది. ఇప్పుడు సాధారణంగా చేశారా లేకుండా ఎవరిపైనైనా అసంతృప్తిని వ్యక్తం చేయడానికా అనేది తేలాల్సి ఉంది.

మహబూబ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి నారాజ్ అయ్యారా? పార్టీ పదవుల విషయంలో ఆయన అలకబూనారా? ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తన నిరసనను ఎలా ప్రదర్శించాలో తెలియకనే స్తబ్దుగా ఉంటున్నారా? అంటే తాజా పరిణామాలు అందుకు అవుననే సమాధానం ఇస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఉన్న సీనియర్ నేతల్లో చిన్నారెడ్డి టాప్ 10లో ఉంటారు. సోనియా గాంధీ నుంచి రాహుల్‌గాంధీ వరకు ఆయన సుపరిచితుడు. వనపర్తి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన చిన్నారెడ్డి గత ఎన్నికల్లో టికెట్ వచ్చి చివరి నిమిషంలో దక్కకుండా పోయింది. ఆ స్థానంలో తూడి మేఘారెడ్డి పోటీచేసి విజయం సాధించారు. తన సీనియారిటీని, పార్టీలో ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించారు. అలాగే ప్రగతి భవన్‌లో ప్రతీవారం నిర్వహించే ప్రజావాణి బాధ్యతలను కూడా అప్పగించారు. అప్పటి నుంచి తన కేడర్ కూడా బలం కూడదీసుకుంటోంది.

చిన్నారెడ్డి, మేఘారెడ్డి బయటకు బాగానే ఉన్నట్లు కనిపించినా ఇద్దరూ నియోజకవర్గంలో కలిసి పోవడం లేదనేది బహిరంగ రహస్యమే. గతంలోనూ పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల శంకుస్థాపనల విషయంలో విభేదాలు బహిరంగాగానే కనిపించాయి. అయితే కొద్దికాలంగా నియోజకవర్గంలో చిన్నారెడ్డి ఎక్కువగా పర్యటించడం లేదు.

వీరిద్దరి మధ్య ఏదైనా అధిష్ఠానం సయోధ్య కుదిర్చిందా అనేది తెలియదు కానీ ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వన్‌సైడ్‌గానే పార్టీని నడిపిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్ల పంపిణీ విషయంలో ఏవైనా విభేదాలు తలెత్తే అవకాశం

(మిగతా 6లో..)

## నిఘా నేత్రాలదే కీలక పాత్ర

- సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ, ఎమ్మెల్యే



ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి

బిజినేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో నిఘా నేత్రాలదే కీలక పాత్ర అని నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం తిమ్మాజీపేట, బిజినేపల్లి మండలాల పరిధిలోని ఏర్పాటు చేసిన వైర్‌లెస్ సీసీ కెమెరాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఎన్నారై తిప్పిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.6.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు మరో రూ.5 లక్షల విలువైన బ్యాక్ సామగ్రిని అందజేశారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మంగనూర్ గ్రామానికి చెందిన డాక్టర్ తిరుమల్, కురుమయ్య, కృష్ణారెడ్డి, నగేష్, జాలం కురుమయ్య, ఎన్నారై రామచంద్రారెడ్డిచే సాయం అందించడంలో సహకరించిన అడ్వకేట్ వీరశేఖరాచారి, జగత్ చంద్రయ్యలను సన్మానించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు వివేక్ రెడ్డి తన స్వచ్ఛంద సంస్థ ద్వారా వంద సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మంగనూర్ గ్రామానికి చెందిన కొండన్న అవసరమైన ఆర్థిక సాయం అందజేస్తానని అన్నారు. ఎమ్మెల్యే, ఎస్పీలతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ కె.శ్రీ నివాస్‌లను ఆయా గ్రామాల నాయకులు సన్మానించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలిస్తున్నా సీసీ కెమెరా దృశ్యాలను, రోడ్డు ప్రమాదాల సీసీ ఫుటేజీలు ప్రజలకు చూపి నేరస్తులను గుర్తించి శిక్షించవచ్చని పేర్కొన్నారు.

## నీతి ఆ'యోగం'..!

- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్‌కు ఐదో స్థానం
- జోనల్ స్థాయిలో అయిదు రాష్ట్రాల్లో రెండో ర్యాంకు

7



నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో గట్టుకు ఐదో స్థానంపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ సంతోష్‌ను సన్మానిస్తున్న గట్టు ఎంపీడీవో చెన్నయ్య (ఫైల్)

## టాప్-5లో ఉండటం అభినందనీయం

- సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందాలి
- బ్యాంకర్లు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి

6



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

# అన్నదాత ఆనందం



అమరచింత లిఫ్ట్ ద్వారా వదిలిన సాగునీరు

- అమరచింత లిఫ్ట్ ద్వారా విడుదల అవుతున్న సాగునీరు
- లిఫ్ట్ కింద 2500 ఎకరాలు సాగులోకి..
- ఆయకట్టుదారుల కమిటీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తి

అమరచింత, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఈసారి ముందస్తుగా వరదలు రావడంతో ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న అమరచింత ఎత్తిపోతల పథకానికి మహర్దశ కావడంతో రైతన్నల్లో ఆనందం కనిపిస్తున్నది. ఎన్టీఆర్ ప్రధాన ఎడమ కాలువకు అనుసంధానంగా నిర్మించిన అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు కమిటీ సభ్యులు సాగునీటిని విడుదల చేశారు. ముందస్తుగా సాగునీరు రావడంతో ఆయా గ్రామాల లిఫ్ట్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ● 4200 ఎకరాల ఆయకట్టు

అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా 4200 ఎకరాల ఆయకట్టు ఉండే విధంగా 6 కోట్ల పైచిలుకు అంచనా వ్యయంతో 1999 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించి ఈ పథకాన్ని రూపొందించారు. అమరచింత, మస్తీపూర్, పామిరెడ్డిపల్లి, సింగంపేట, ఖానాపూర్, మూలమల్ల తదితర గ్రామాలను కలుపుకొని 4200 ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు.

ఆయా గ్రామాల్లో ముందస్తు సాగు నీటిని వదలడంతో ప్రస్తుతం 2500 ఎకరాలు వరి పంట సాగులోకి రానుంది. మిగిలిన వెయ్యి ఎకరాల మేర పండ్ల తోటలు, చెరుకు, ఆరుతడి పంటలు ఆయకట్టు రైతులు వేసుకుంటున్నారు.

### ● సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్ పంట సాగు కోసం ఈసారి ముందస్తు వరద నీరు జూరాల ప్రాజెక్టుకు రావడంతో చాలా సంతోషంగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న అమరచింత లిఫ్టు ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశాం. ఆయా గ్రామాల రైతులు లిఫ్ట్ నీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- చిన్న ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి, అమరచింత ఎత్తిపోతల పథకం

### ● ఆయకట్టు కమిటీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తి

6 కోట్ల పైచిలుకు అంచనా వ్యయంతో నిర్మించిన అమరచింత ఎత్తిపోతల పథకాన్ని 1999లో ప్రారంభించుకున్నారు. అప్పట్లో ఐడీసీ అధికారులు ఒక సంవత్సరం పాటు లిఫ్ట్ ఆయకట్టు నిర్వహణ బాధ్యతను తీసుకున్నారు. 2000 సంవత్సరంలో అమరచింత లిఫ్టు ఆయకట్టును ఆయా గ్రామాల రైతులతో కలిపి ఓ కమిటీని ఏర్పాటు చేశారు. లిఫ్ట్ ఆయకట్టు రైతుల భాగస్వామ్యంతో నేటికీ 25 ఏళ్ల కమిటీ ఏర్పడి పూర్తవుతున్నా ఈ లిఫ్ట్ ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిర్విరామంగా కొనసాగుతున్నది.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందించాలి

- డీ 82 కాలువను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్



డీ 82 కాలువను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చారకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) పాలమూరు - రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు రైతంగానికి సాగునీరు అందించి ఆదుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి శివారులోని కేఎల్ఐ డీ 82 కా లువను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ప్రాజెక్టుల కోసం రూ.35 వేల కోట్ల నిధులు కేటాయించి రూ. 27.500 కోట్లతో ప్రాజెక్టులను పూర్తి చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాంత బిడ్డను అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. కేఎల్ఐతో పాటు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను వెంటనే చేపట్టి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జూపల్లిలో ఇటీవల మృతి చెందిన కడారి వీరయ్య, అంకిళ్ల మైసమ్మ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎదిరే రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కలమందల జగపతి, వెల్దండ మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, నాయకులు పెద్దయ్యయాదవ్, తిరుపతయ్యచారి, బిక్షపతి, వెంకటేష్, శేఖర్‌గౌడ్, రామస్వామి, బిక్కన్, వెంకటయ్యగౌడ్ శ్రీరాములు, రియాజ్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

- జిల్లా కేంద్రంలో వామపక్ష ప్రజా సంఘాల నిరసన ర్యాలీ



వనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వనపర్తి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల కనీస హక్కులను కాలరాస్తుందని కార్మిక యూనియన్ నాయకులు మండిపడ్డారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగం గా జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐసీఈయూ తదితర కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించిన కార్మికులు జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. పారిశ్రామిక సంబంధాల కోడ్ పేరుతో ట్రేడ్ యూనియన్ చట్టం 1926, ఇండస్ట్రీయల్ ఎంప్లాయిమెంట్ చట్టం 1946, పారిశ్రామిక విధానాల చట్టం 1947 ఈ మూడు చట్టాలు రద్దు చేసి పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020ని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఇది ఉద్యోగ భద్రతకే ప్రమాదం తెచ్చిందని మండిపడ్డారు. సామాజిక భద్రత కోడ్ పేరుతో 9 కార్మిక చట్టాలను రద్దు చేసి పీఎఫ్, ఈఎస్ఐ భద్రత లేకుండా చేసిందన్నారు. సీఐటీయూ నాయకుడు పుట్ట ఆంజనేయులు, టీయూసీఐ నాయకుడు అరుణ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకుడు మోష, బీఆర్‌టీయూ నాయకుడు గట్టు యాదవ్, రమేష్, గణేష్, కొత్తగొల్ల శంకర్, పరమేశ్వరాచారి, లక్ష్మి, గంధం మదన్, గోపాలకృష్ణ, రామకృష్ణ, బీసన్న, రాజారాం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ఇన్‌చార్జి కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి ఎకో పార్కులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ప్రాణ వాయువునిచ్చి మనుగడనిచ్చే మొక్కలను ప్రతీ ఒక్కరు విరివిగా పెంచాలని వన పర్తి ఎమ్మెల్యే తూడి మే ఘారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని ఏకో పార్కులో మొక్కలు నాటే కార్యక్రమానికి కలెక్టర్ ఇన్‌చార్జి విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, డీఎఫ్‌వో సత్యనారాయణతో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణం సమతుల్యంగా ఉండడానికి 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలని, కానీ వనపర్తి జిల్లాలో 18 - 19 శాతం మాత్రమే ఉందన్నారు. దీనిని 33 శాతానికి పెంచడానికి జిల్లాలోని ప్రజలందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వృక్షో రక్షితి రక్షితః అనే నానుడి ప్రకారం చెట్లను మనం కాపాడితే మనలను చెట్లు కాపాడతాయని కలెక్టర్ అన్నారు. వనపర్తి జిల్లాలో ఈ సంవత్సరం 21 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది అందరూ పాల్గొని తలా ఒక మొక్కను నాటారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- మొదటి పోస్టింగ్ జీవితాంతం గుర్తుండాలి
- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్
- ఆరుగురు నూతన ఎస్ఐలకు పోస్టింగులు

7

## కళాశాల విద్యార్థులపై కత్తితో దాడి

- ఒకరి పరిస్థితి విషమం, కర్నూల్ ఆసుపత్రికి తరలింపు
- దాడిచేసిన యువకుల పరారీ

6

## ఫుట్‌బాల్ పోటీల్లో.. గద్వాల జిల్లా జట్టు బోణి

7

## క్లిక్.. క్లిక్..

## నారుమడికి రక్షణగా..

సాగుచేసిన వరి నారుమడికి పశువులు, పక్షులు రాకుండా ఓ రైతు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేశాడు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామానికి వెళ్లే దారి మధ్యలో రోడ్డు పక్కన నారుమడి చుట్టూ కర్రలు పాతి, వాటికి ప్లాస్టిక్ కవర్లను రక్షణగా కట్టాడు. ఈ దృశ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



## 'సుంకేసుల'కు కొనసాగుతున్న వరద

» ఇన్‌ఫ్లో 60 వేలు, అవుట్‌ఫ్లో 62 వేల క్యూసెక్కులు



సుంకేసుల డ్యాం నుంచి విడుదలవుతున్న వరద

రాజోలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం ఎగువ నుంచి 60 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో డ్యామ్ 16 గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.30 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.634 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

## న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు

» పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు లభించిందని రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు లో రెండు సెక్షన్లకు కలిపి 60 మంది విద్యార్థుల చొప్పున చేర్చుకోవచ్చని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

## ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

» ఉద్యానశాఖ డివిజన్ అధికారి చంద్రశేఖర్



పెద్దాపూర్‌లో ఆయిల్‌పామ్ గెలలు చూపుతున్న రైతులు

ఉప్పునుంతల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందొచ్చని ఉద్యానశాఖ అచ్చంపేట డివిజన్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని పెద్దాపూర్‌లో నిరంజన్‌రావు సాగు చేసిన ఆయిల్‌పామ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో 1936 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పునుంతల మండలంలో 151 మంది రైతులు 629 ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. పెద్దాపూర్‌లో రైతు నిరంజన్‌రావు 5 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్ మూడున్నర సంవత్సరాల్లో కోతకు వచ్చిందని తెలిపారు. ఒక నెలలో 2 టన్నుల గెలలు వచ్చాయని, టన్ను ధర రూ. 17,463 చొప్పున నెలలో 2 టన్నులకు రూ. 35 వేల రూపాయిలు లాభం వచ్చినట్లు తెలిపారు.

## రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

» నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి

కొత్తకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నాబార్డు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీడీఎం మనోహర్‌రెడ్డి మత్స్యకారులకు సూచించారు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామంలో బుధవారం ఎస్ఐఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మత్స్య ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపల పెంపకం, వ్యాపారం కోసం మత్స్యకారులకు నాబార్డు రూ.27 లక్షల నిధులు మంజూరు చేస్తుందన్నారు. సభ్యుల పొదుపు, వాటాధనం ఆధారంగా రూ. 15 లక్షలు ఈక్విటీ గ్రాంట్ ఇస్తుందని తెలిపారు. సభ్యులందరూ ఐక్యంగా ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ జిల్లా అధికారి లక్ష్మప్ప, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శివకుమార్, ఐఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కురుమయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, సీఈవో అరుణ, మత్స్యకార్మికులు బాలరాజు, పరమేశ్, పెంటన్న, శ్రీనివాసు లు, ఇందిరమ్మ పాల్గొన్నారు.

## మూతబడిన సర్కారు బడి

» పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు

» డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడు



శ్రీనగర్ గ్రామంలో మూతపడిన సర్కారు బడి

అలంపూర్ చౌరస్తా, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలం, చంద్రశేఖర్‌నగర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం శ్రీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల మూతపడింది. ఈ గ్రామంలో 420 మంది జనాభా ఉన్నారు. గ్రామంలోని పాఠశాలలో 2022-2023 విద్యాసంవత్సరంలో 12 మంది ఉండేవారు. 2023-2024లో ఆ సంఖ్య 7కు తగ్గింది. ఈ విద్యా సంవత్సరంలో ఒకరు మూడవ తరగతి, మరొకరు రెండవ తరగతి విద్యార్థులు మాత్రమే మిగిలారు. మిగతా వారు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. ఇక్కడి ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి ఇటీవల డిప్యూటేషన్‌పై కలుకుంట్ల గ్రామానికి వెళ్లిపోయారు. దీంతో రెండు వారాలుగా పాఠశాల తెరుచుకోవడం లేదు. ఈ విషయంపై ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇద్దరు పిల్లల కోసం బడికి ఎలా వెళ్లాలని, డీఈవో అనుమతితో డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు చెప్పారు. డీఈవో మహ్మద్ అబ్దుల్ ఘనీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఎంఈవోతో మాట్లాడి పాఠశాల పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

# కళాశాల విద్యార్థులపై కత్తితో దాడి

» ఒకరి పరిస్థితి విషమం, కర్నూల్ ఆసుపత్రికి తరలింపు

» దాడిచేసిన యువకుల పరారీ

» ప్రేమ వ్యవహారమే కారణం ?



వీపుపై కత్తి గాయమైన రవితేజ

గద్వాల క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కొందరు యువకులు పథకం ప్రకారం కత్తితో చేసిన దాడిలో ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని గంజిపేట కాలనీకి చెందిన రవితేజ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం, అలాగే చరణ్‌తేజ ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం చరణ్‌తేజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న చింటూ అనే విద్యార్థి కళాశాల ఆవరణలో గొడవపడ్డారు. తర్వాత ఎక్కడివారు అక్కడే విడిపోయి వెళ్లిపోయారు. ఈ గొడవ విషయాన్ని చింటూ తన స్నేహితుడు ఉదయ్ తెలిపాడు. ఈ క్రమంలో చరణ్‌తేజ తన చెల్లెలిని కళాశాల నుంచి తీసుకొచ్చేందుకు సాయంత్రం బైక్‌పై గంజిపేట నుంచి కొత్తబస్టాండ్ వైపు వస్తుండగా సుంకులమ్మమెట్టు కాలనీ సమీపంలో కోటబురుజు దగ్గర ఎరుకలిరాజు, బానుతో పాటు ఉదయ్ మరో ముగ్గురు వ్యక్తులు కాపుకాశారు. చరణ్‌తేజ బైక్‌ను ఆపి తాళం లాక్కొని కోటబురుజు సమీపంలోకి రావాలన్నారు. ఈమేరకు కోట బురుజు సమీపంలోకి చరణ్‌తేజ రావడంతోనే ముగ్గురు కలిసి మూకుమ్మడిగా దాడి చేశారు. ఎరుకలి రాజు అనే యువకుడు తన దగ్గర ఉన్న కత్తితో చరణ్‌తేజ్‌పై దాడి చేయగా వీపుపై గాయాలయ్యాయి. వారినుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా అటువైపు వెళుతున్న చరణ్‌తేజ వరుసకు తమ్ముడు అయిన డిగ్రీ చదివే రవితేజ తన అన్నపై ఎందుకు దాడి చేస్తున్నారని అడిగేందుకు ప్రయత్నించగా వెంటనే ఎరుకలి రాజు తన చేతిలో ఉన్న కత్తితో అతనిపై కూడా దాడిచేశాడు. దీంతో గాయాలైన రవితేజ వారినుంచి తప్పించుకుంటూ రోడ్డుపై పరుగెత్తుకువచ్చి తన మిత్రులకు ఫోన్‌లో విషయాన్ని చేరవేశాడు. వారు వచ్చి బైక్‌పై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. అయితే రవితేజ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చరణ్‌తేజ స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు. ఈ గొడవకు ప్రధాన కారణం ప్రేమ వ్యవహారమే అని విశ్వసనీయంగా తెలుస్తుంది. తన మిత్రుడికి దక్కని ప్రేమ వేరే వారికి దక్కుతుండటమే ఈ గొడవకు ప్రధాన కారణమని విశ్వసనీయంగా తెలుస్తుంది. ఈ విషయంపై బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారు.

# టాప్-5లో ఉండటం అభినందనీయం

» సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందాలి

» బ్యాంకర్లు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి

» నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి

గద్వాలన్యూటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ టాప్ - 5 స్థానాన్ని సాధించడం అభినందనీయమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అధికారులు సమష్టి సహకారంతో కృషి చేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు పంటరుణాలు, ప్రాధాన్య, ప్రాధాన్యేతర రంగాలకు విరివిగా రుణాలు అందించాలని జాతీయ, ప్రైవేట్ గ్రామీణ బ్యాంకర్లకు సూచించారు. ఎర్రవల్లి, ధరూర్ మండల కేంద్రాల్లో కొత్తగా ఎస్‌బీఐ బ్రాంచులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణాభివృద్ధి కింద జిల్లాలో 1.56 లక్షల జాబ్ కార్డులను జారీ చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా గత మూడు నెలల్లో 2,074 పనిదినాలను కల్పించినట్లు తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమం ద్వారా నర్సరీలు, ప్లాంటింగ్, ఫిట్టింగ్ తదితర పనులు చేపట్టినట్లు చెప్పారు. స్వచ్ఛభారత్ పథకం కింద జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. 17,549 మందికి వృద్ధాప్య, వితంతు పెన్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 57,400 మందికి బీపీ, 25 వేల మందికి డయాబెటిస్ ఉన్న వారిని గుర్తించి వారికి మందులు ఇస్తున్నట్లు చెప్పారు. 661 టీబీ వ్యాధిగ్రస్థులకు చికిత్స అందిస్తున్నామన్నారు. జిల్లాలో 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 57 సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,328 మందికి చికిత్స చేయించినట్లు చెప్పారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో 3,994 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. గత ఏడాది 10వ తరగతి పరీక్షలలో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పాఠశాలల్లో కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధాన మంత్రి సడక్ యోజన కింద పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో ప్రతి పాదిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, దిశ కమిటీ సభ్యులు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, గిరిబాబు, శంకర్, రాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'సహకార్ సే సమృద్ధి'తో రైతులకు మేలు

» జిల్లా సహకార అధికారి శంకరాచారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శంకరాచారి

కోయిలకొండ,జూలై 9 (ఆంధ్రజ్యోతి): సహకార్ సే సమృద్ధితో రైతులను అభివృద్ధి చేసేందుకు (ఎఫ్‌పీఓ) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని జిల్లా సహకార అధికారి శంకరాచారి వెల్లడించారు. బుధవారం మండలంలోని గార్లపాడ్ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 311 ఎఫ్‌పీఓగాను జిల్లాకు ఏడు మంజూరయ్యాయని, ఇందులో కోయిలకొండ మండలం గార్లపాడ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ సంవత్సరం రూ.6 లక్షల ద్వారా మూడేళ్లకు రూ.18లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో సహకారం సంఘం రైతులు రూ.2వేలు చెల్లించి ఎఫ్‌పీవోలో సభ్యత్వం తీసుకుంటే 750 రైతులకు రూ.15 లక్షలు పోగు చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ.15లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు రూ.2కోట్ల వరకు బ్యాంకు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంల్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, యామారెడ్డి, వీరభద్రయ్య, శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పోచమ్మ తల్లి వార్షికోత్సవాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో పోచమ్మ తల్లి (శీతలాదేవి) వార్షికోత్సవాలు, ఆషాడమాస బోనాలు గురువారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాలలో భాగంగా గురువారం సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, విశ్వేశ్వర భజన మండలి సభ్యులచే అఖండ భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలకు పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## శాంతిభద్రతల రక్షణే పోలీసుల కర్తవ్యం



జాగిలాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలు కల్పించేందుకు పోలీసులు నిరంతరం పనిచేస్తుంటారని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకోసం ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నామన్నారు. బుధవారం పోలీస్‌అధికారులు జాగిలాలతో నగరంలోని రామయ్యబౌళి, మినీట్యాంక్‌బండ్‌పై ఈవెనింగ్ వాక్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి విక్రయాలు కాకుండా కఠినచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయాలు, గంజాయి సేవిస్తున్న సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనారు.

( 5వ పేజీ తరువాయి )

# చిన్నన్న నారాజ్!

లేకపోలేదు. ప్రస్తుతానికైతే అంతగా విభేదాలు బయటపడటం లేదు. తనకు ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతల్లో చిన్నారెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు.

### పార్టీ పదవుల విషయంలోనేనా...?

చిన్నారెడ్డి ప్రస్తుతం ప్రభుత్వంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉండగా పార్టీలో ఏఐసీసీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మొన్నటివరకు పార్టీ క్రమశిక్షణ కమిటీ సంఘం చైర్మన్‌గా పనిచేశారు. అయితే క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఉన్న తనకు ఇంకా పదవీకాలం ఉండగానే మార్చారని చెప్పినట్లు ఆయన సన్నిహితులు కొందరు చెబుతున్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా క్రమశిక్షణ కమిటీని సమర్థవంతంగా నిర్వహించారనే పేరు ఆయనకు ఉన్నది. ఈ విషయంలో అధిష్టానానికి లేఖ కూడా రాసినట్లు తెలుస్తోంది. అయితే పార్టీలో కీలకమైన ఈ క్రమశిక్షణ కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ మల్లు రవిని పార్టీ నియమించింది. దీని విషయంలో కొంత నారాజ్ అయినట్లు సమాచారం. అలాగే పార్టీలో సంస్థాగత పదవులు చాలా కీలకంగా ఉంటాయి. ఆయనను క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నుంచి తప్పించిన తర్వాత రాజకీయ వ్యవహారాల కమిటీలో సభ్యుడిగా నియమించారు. అయితే సంస్థాగత పదవులు కూడా దక్కడం లేదనే వాదన ఆయన వర్గం నుంచి వ్యక్తమవుతోంది. ఇటీవల అన్ని ఉమ్మడి జిల్లాలకు సంస్థాగత ఇన్‌చార్జిలను పార్టీ నియమించింది. ఇందులో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏఐసీసీ కార్యదర్శులుగా ఉన్న వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్‌కు ఖమ్మం, నల్గొండ బాధ్యతలు వచ్చాయి. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న శివసేనారెడ్డికి రంగారెడ్డి బాధ్యతలను పార్టీ అప్పగించింది. అయితే చిన్నారెడ్డికి ఏదో ఒక జిల్లాను అప్పగిస్తే బాగుండేదని తన కేడర్ భావిస్తోంది. అయితే ఇటీవల ఆయన కేడర్‌కు చెందిన నందిమల్ల యాదయ్యకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ పదవి వచ్చింది. అయితే అనూహ్యంగా ఇంతకాలం గన్‌మెన్లను కొనసాగిస్తూ ప్రభుత్వ వాహనాన్ని వినియోగిస్తున్న చిన్నారెడ్డి సరెండర్ చేయడంపై అనేక ఊహాగానాలు వస్తున్నాయి. పార్టీ పదవుల విషయంలోనే ఆయన నారాజ్ అయ్యారనే భావనకు బలం చేకూరుస్తున్నాయి.

### కుమారుడి కోసం ఆరాటం...

పార్టీలో సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి తదుపరి తన కుమారుడు డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డిని నియోజకవర్గంలో కీలకంగా ఉంచాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో బాధ్యతల్లో ఉన్న ఆదిత్యారెడ్డి గత ఎన్నికల సమయంలోనూ నియోజకవర్గంలో తిరిగారు.

అవకాశం వస్తే జిల్లా పరిషత్ చైర్మన్ బరిలో ఆదిత్యారెడ్డిని దింపాలని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కొత్త నియోజకవర్గాలు ఏర్పడితే ఏదో ఒక నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఇప్పించు కోవాలని ఆలోచన చేస్తున్నట్లు తన కేడర్‌లోని కొంతమంది చెబుతున్నారు. కానీ అంత సులభంగా అది వచ్చే పరిస్థితులు మాత్రం లేవని స్పష్టంగా తెలుస్తోంది. అనేకమంది ఈ పదవి ఆశలో ఉన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్టు బిగిస్తుండగా తాను కూడా తిరిగి కీలకంగా కావడం కోసం తాపత్రయపడు తున్నట్లు సమాచారం. కుమారుడి రాజకీయ భవిష్యత్‌ను సరైన దిశలో పెట్టడం, తన కేడ ర్‌కు భరోసా ఇవ్వాలని భావిస్తున్నట్లు సమా చారం. అయితే గతంలో కూడా చిన్నారెడ్డి గ న్‌మెన్లను సరెండర్ చేసిన సందర్భాలు ఉండ గా ఇప్పుడూ ఆ కోవలోనే చేశారా? లేక పార్టీ పదవుల విషయంలో నారాజ్ కావడం వల్లే నిర్ణయం తీసుకున్నారా అనేది తేలాల్సి ఉంది. ఇదే విషయమై ఆయనను ఫోన్‌లో సంప్ర దించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

## అదుపు తప్పి కారు బోల్తా

» నలుగురికి తీవ్ర గాయాలు - వారిలో ఒకరి పరిస్థితి విషమం

» హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

పెద్దకొత్తపల్లి, జూ లై 9 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తా పడటంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకద్ర మండలానికి చెందిన దుబ్బల శ్రీధర్ (20), భూత్పూర్ హర్షవర్ధన్‌రెడ్డి, తుమ్మల రాఘవేందర్, దుబ్బల హరిప్రసాద్‌లు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిలకు కారులో బయలు దేరారు. పెద్దకొత్తపల్లి మండలం, వావిళ్ల బావి గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో నలుగురూ తీవ్రంగా గాయపడటంతో 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో దుబ్బల శ్రీధర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా, మార్గంమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సతీశ్ తెలిపారు.

## మూడు ఆలయాల్లో చోరీ



బయట పడవేసిన ఆలయ హుండీ

మక్తల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, మక్తల్ పట్టణంలోని మూడు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. పట్టణ శివారులో ఉన్న జములమ్మ ఆలయంలో హుండీతో పాటు ఐదు కిలోల బరువున్న పంచ లోహ విగ్రహం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు అర్చకుడు నర్సప్ప తెలిపారు. నగరేశ్వర స్వామి ఆలయంలోని హుండీని పగులగొట్టి దాదాపు రూ.10 వేలు చోరీ చేశారు. దొంగలు ఆంజనేయస్వామి ఆలయంలో వెండి దీపాలు, రూ.20 వేల నగదును ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళం పగులగొట్టి దొంగలు బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామంలో జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ద కురువ రేణుక మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువాలోని ఆరు తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి గొలుసులు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనపై బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.


## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఊర్కొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు.. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా బ్లూకోర్టు కానిస్టేబుళ్లు ప్రశాంత్, హరీష్‌లు మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చేరుకున్నారు. అదేగ్రామానికి చెందిన మాడ్గుల రమేష్ పోలీసులను దుర్భాషలాడుతూ బైక తాళం తీసుకొని ఇబ్బంది పెట్టడంతో పాటు వారి వద్ద నున్న మొబైల్స్ లాక్కొని తీవ్ర ఇబ్బందులు గురి చేశాడని తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మాడ్గుల రమేష్‌పై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## వ్యక్తి మృతి : కేసు నమోదు

తెలకపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బల్మూరు మండలానికి చెందిన గౌరమోని లింగస్వామి (46) మూడు రోజుల క్రితం పీర్ల పండుగ నిమిత్తం తన అత్తగారి ఊరైన తెలకపల్లి మండల పరిధిలోని రాకొండకు వచ్చాడు. మంగళవారం రాత్రి 10.00 గంటలకు తమ అత్తగారింట్లో తమ బంధువులతో కలిసి మద్యం సేవిస్తుండగా అకస్మాత్తుగా కూర్చున్న చోటనే కింద పడిపోయి స్పృహకోల్పోగా వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. అతని తమ్ముడు గౌరమోని రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



సల్ల యాదయ్య (ఫైల్)

మూసాపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీ పనిచేయడానికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదవంగా మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని జానంపేటలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. జానంపేటకు చెందిన సల్లయాదయ్య(56) గ్రామంలో వ్యవసాయ కూలీ పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం కూడా గ్రామంలో ఓ రైతు పొలంలో కంపచెట్లను తొలగించడానికి వెళ్లి మృతి చెందాడు. గమనించిన గొర్రెలకాపరులు కుటుంబసభ్యులు, గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. కాగా ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఇంకా ఫిర్యాదు రాలేదని, రాగానే విచారించి చర్యలు తీసుకొంటామని పోలీసులు తెలిపారు.

## గొంతులో మాంసపు ముద్ద ఇరుక్కొని మహిళకు అస్వస్థత

మిడ్జిల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన తులసమ్మ గొంతులో మాంసపు ముద్ద ఇరుక్కొని అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని తమ బంధువు అయిన కొమ్ము రాములు మృతి చెందడంతో బుధవారం దశదినకర్మ చేశారు. దినాల వద్ద కు వెళ్లి అన్నంతో పాటు మాంసం తినడంతో గొంతులో ముద్ద ఇరుక్కోవ డంతో ఆమెకు తీవ్ర అస్వస్థకు గురైనట్లు తెలిపారు.

వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్‌కు తీసుకెళ్లినట్లు గామస్థులు తెలిపారు.

క్రైం కార్నర్

## పాము కాటుతో వ్యక్తి మృతి


కృష్ణారెడ్డి (ఫైల్)

ఉప్పునుంతల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలంలోని కొరటికల్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుట్టకాడి కృష్ణారెడ్డి (65) మంగళవారం రాత్రి భోజనం అనంతరం ఇంట్లో నిద్రపోతుండగా, పాము కాటు వేసింది. దీంతో మెళకువ వచ్చిన ఆయన పామును చంపేశాడు. బుధవారం ఉదయం చుట్టుపక్కల వారికి విషయం తెలిపాడు. వారు అతడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అతడి భార్య గతంలో కరోనాతో చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ఎర్రవల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ యువకుడు మృతి చెందాడు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సోనేలాల్‌సింగ్ (25) నాలుగు నెలల క్రి తం జోగుళాంబ గద్వాల జిల్లాకు వలస వచ్చాడు. అనంతపురం గ్రామంలో ని ఓ రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు మంగళవారం ఎర్రవల్లి చౌరస్తాకు వచ్చాడు. హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీ వ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై అతడి స్నే హితుడు సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడి అదృశ్యం

» గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

వెల్దండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడు అదృశ్యం అయ్యాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. వారు బాలుడిని వెతికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని చెదురుపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన నరేందర్ కుమారుడు రిత్విక్ (3) బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ కనబడకుండా పోయాడు. కాసేపటికి గమనించిన తల్లిదండ్రులు చుట్టుపక్కల ఇళ్లలో వెతికినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెంటనే స్పందించి, వెల్దండ పోలీసులను అప్రమత్తం చేశారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి పోలీసు సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. వివరాలు తెలుసుకొని బాలుడి కోసం గాలించారు. సమీపంలోని ఓ పొలంలో రిత్విక్ ఏడుస్తూ కనిపించాడు. దీంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## వేర్వేరు చోట్ల మరో ఇద్దరు..


ఆంజనేయులు (ఫైల్)

గోపాల్‌పేట/జడ్చర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యం అయ్యారు. గోపాల్‌పేట ఎస్ఐ నరేశ్‌కుమార్, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్ ఈ నెల 6న ఎవరికీ చెప్పకుండా వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు భాను ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి రాఘవేందర్ ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతడి తల్లి ఎరుకలి అంజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

## లారీ ఢీకొని కంటైనర్ బోల్తా

» అదే లారీని ఢీకొన్న కారు » ఒకరికి తీవ్ర గాయాలు


రోడ్డు పక్కన బోల్తాపడిన కంటైనర్

మానవపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై లారీ ఢీకొని కంటైనర్ వ్యాన్ బోల్తాపడింది. అదే లారీని మరో కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. హైవే సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కంటైనర్ వ్యాన్ ముందు వెళ్తున్న కారు స్లో కావడంతో వేగం తగ్గింది. దీంతో వెనుక నుంచి వస్తున్న లారీ దాన్ని ఢీకొనడంతో బోల్తాపడింది. అదే లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వెంకట పృధ్విరాజ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు హైవే సిబ్బంది తెలిపారు.

## ఆర్డీఎస్ కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


ఉప్పల గ్రామ సమీపంలో అదుపు తప్పి ఆర్డీఎస్ కాలువలోకి దూసుకెళ్లి నీటిలో మునిగిపోయిన ట్రాక్టర్

అయిజ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పిన ట్రాక్టర్ ఆర్డీఎస్ ప్రధాన కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని ఉప్పల గ్రామ సమీపంలో జరిగింది. గ్రామవాసి రాజారెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను బుధవారం ఉదయం డ్రైవర్ చిన్న తిమ్మప్ప పొలం పనులకు తీసుకెళ్లాడు. గట్టు మీదినుంచి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లి నీటిలో మునిగిపోయింది. ప్రమాదాన్ని పసిగట్టిన తిమ్మప్ప కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది.

# నీతి ఆ'యోగం'..!

» వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్‌కు ఐదో స్థానం
» జోనల్ స్థాయిలో ఐదు రాష్ట్రాల్లో రెండో ర్యాంకు
» 39 అంశాల్లో అభివృద్ధిని ప్రామాణికంగా తీసుకున్న కేంద్ర సంస్థ
» ర్యాంకు వచ్చినందుకు గట్టు బ్లాక్‌కు రూ. కోటి నజరానా
» ప్రథమ స్థానం కోసం ముందుకు అడుగులు


పెంచికలపాడు శివారులో భవిష్యభారత్ సంస్థ నిర్మించిన చెక్‌డ్యాం (ఫైల్)

గట్టు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే అక్షరాస్యతలో వెనుకబాటుతనంతో పాటు అన్ని రంగాల్లో వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందింది గట్టు మండలం. అలాంటి మండలం ప్రస్తుతం నీతి ఆయోగ్ దృష్టిని ఆకర్షించింది. నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ర్యాంకింగ్‌లో దేశంలోని 500 బ్లాక్‌లలో గట్టు బ్లాకు 5వ స్థానంలో నిలిచింది. జోనల్ స్థాయిలో (తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు కలిపి జోన్) రెండో ర్యాంక్‌ను సాధించింది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం గట్టు మండలానికి కోటి రూపాయలను నజరానాగా మంజూరు చేసింది. ఈ నిధులను కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో గట్టు మండలంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు వినియోగించనున్నారు. గట్టు మండలం నీతి ఆయోగ్ ర్యాకింగ్‌లో 5వస్థానం రావడంతో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని మండలవాసులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నూరు శాతం లక్ష్యం కోసం ముందుకు**

నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో దేశవ్యాప్తంగా 5వ స్థానం దక్కించుకున్న గట్టు బ్లాక్‌ను భవిష్యత్తులో అగ్రస్థానంలో ఉంచేందుకు అధికారులు పట్టుదలతో ఉన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇటీవల కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్ నందు గట్టు బ్లాక్‌పై సమీక్ష నిర్వహించారు. గట్టు బ్లాకుకు స్థానం దక్కడానికి అందరి సమష్టి కృషి ఫలితమన్నారు. నూరుశాతం లక్ష్య సాధన కోసం ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని గట్టు మండల అధికారులకు, విభాగాధిపతులను, ఫ్రంట్‌లైన్ సిబ్బందిని అభినందిస్తూ కలెక్టర్ పలు సూచనలు చేశారు.

**స్వచ్ఛంద సంస్థల సహకారం**

ఐదో స్థానం సాధించడానికి మండలంలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా పని చేశాయి. ప్రధానంగా భవిష్య భారత్ సంస్థతో పాటు టీచ్‌ఫర్ ఛైంజ్, ఎంవీఎఫ్ ఫౌండేషన్‌లు తమవంతుగా ఆరోగ్యం, విద్యాభివృద్ధికి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెక్‌డ్యాంల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, వంటి సహకారాలు అందించారు.

**5 ప్రధాన విభాగాలలో 39 అంశాలలో అభివృద్ధి ప్రామాణికంగా ర్యాంకింగ్**

మండలంలోని 5 ప్రధాన విభాగాలు 1)ఆరోగ్యంతో పాటు పోషణ, 2)విద్య, 3) వ్యవసాయంతో పాటు అనుబంధ సేవలు, 4)ప్రాథమిక మౌలిక సదుపాయాలు, 5)సామాజిక అభివృద్ధి వంటి ఐదు అంశాల లోని 39 సూచికలలో సాధించిన అభివృద్ధిని ప్రామాణికంగా తీసుకుని ఐదో స్థానాన్ని కేటాయించారు.

నీతి ఆయోగ్ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్న సందర్భంలో నీతి ఆయోగ్ ప్రధాన కార్యాలయంలో గట్టు బ్లాక్‌ను ప్రకటించారు. 2024 అక్టోబరు, నవంబర్ డిసెంబరు వరకు, 2025 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల కాలంలో గట్టు బ్లాక్ యొక్క స్కోరు 61. 24 నుంచి 69.43 పెరిగి, 8.19శాతం అభివృద్ధిని నమోదు చేసి డెల్టా ర్యాంకింగ్‌లో చేరింది. మొత్తం 39 సూచికలలో లక్ష్యాలను సమర్థవంతగా పూర్తి చేసినట్లు ర్యాంకింగ్‌లో వెల్లడైంది.

**నూరు శాతం లక్ష్యం దిశగా పనిచేస్తాం**



జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశాలు పాటిస్తూ అందరం సమష్టిగా కృషి చేసి ముందుకు వెళ్లడంతో ఈ రోజు ఫలితం లబించింది. ఇందుకు సంతోషంగా ఉన్నది. నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో దేశంలోనే ఐదవస్థానం గట్టు బ్లాక్‌కు లభించడం ఆనందంగా ఉన్నది. నూరు శాతం లక్ష్యం సాధించడానికి కృషి చేస్తాం.

\- చెన్నయ్య, మండల అభివృద్ధి అధికారి

**మరింత కృషితో ముందుకు**



గట్టు మడలం నీతి అయోగ్ ర్యాంకింగ్‌లో ఐదో స్థానం రావడం అనందంగా ఉన్నది. కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశాలతో పాటు నీతి అయోగ్ కేంద్ర సంస్థ యొక్క నిబంధనలను పాటిస్తూ 5 విభాగాలలోని 39 అంశాలలో ఫలితాలను సాధించగలిగాం. అందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేశారు. నీతి ఆయోగ్ కేంద్ర సంస్థ తరుపున నేను గట్టులో పనులను పర్యవేక్షణ చేస్తున్నాను. భవిష్యత్తులో గట్టులో నూరు శాతం లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నాం.

\- ఎండీ అఫ్జల్, గట్టు అస్పిరేషన్ బ్లాక్ కోఆర్డి నేటర్

## క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

» మొదటి పోస్టింగ్ జీవితాంతం గుర్తుండాలి
» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్
» ఆరుగురు నూతన ఎస్ఐలకు పోస్టింగులు


ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు

వనపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నూతన ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాలో నూతన ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టనున్న ఆరుగురితో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటి సారి ఎస్ఐలుగా బాధ్యతలు చేపడుతున్నారని, ఆ ప్రాంత ప్రజలకు జీవితాంతం గుర్తుండేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, చిన్న సమస్యలైతే అప్పటికప్పుడు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ హిమబిందు, పెబ్బేరు ఎస్ఐ దివ్యారెడ్డి, ఖిల్లాఘణపూర్ ఎస్ఐ నరేశ్, వనపర్తి రూరల్ ఎస్ఐ వేణుగోపాల్, వనపర్తి టౌన్ ఎస్ఐ శశిధర్, కొత్తకోట ఎస్ఐ భాస్కర్‌లు ఎస్పీకి మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్ పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో.. గద్వాల జిల్లా జట్టు బోణి


గద్వాల జిల్లా జట్టుతో కోచ్ కరిష్మా, మేనేజర్ విజయ్

గద్వాల అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీల్లో గద్వాల జిల్లా జట్టు బోణీ చేసింది. బుధవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో మెదక్ జిల్లా జట్టుపై 8-0 గోల్స్‌తో విజయం సాధించిందని కోచ్ కరిష్మా తెలిపారు. జిల్లా క్రీడాకారులు సమన్వయంతో ఆడి జట్టు విజయానికి సమష్టిగా కృషి చేశారన్నారు. రెండవ మ్యాచ్ ఈ నెల 10న నిర్వహించనున్నారని, జిల్లా జట్టు రంగారెడ్డి జిల్లా జట్టుతో తలపడనున్నదని తెలిపారు.

## ఉర్దూ మీడియం పాఠశాల పరిశీలన

» 'తరగతి గదికి తాళం' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఉర్దూ మీడియం పాఠశాలలో అదనపు తరగతిని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

ధన్వాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. బిల్లు మంజూరు కాకపోవడంతో అదనపు గదికి కాంట్రాక్టర్ తాళం వేశాడు. ఈ విషయంపై 'తరగతి గదికి తాళం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఏఎంవో విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి గాయత్రి పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు గదిని పరిశీలించారు. ప్రాధానోపాధ్యాయిని శోభారాణితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లును త్వరలోనే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ గంగమ్మ, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటర్ ప్లాంట్ మరమ్మతుకు నిధులు మంజూరు అయినట్లు చెప్పారు.

## ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయించాలి

» ఎంపీ మల్లురవికి రైతుల వినతి


ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు

గద్వాల టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలోని పెద్దధన్వాడ వద్ద నిర్మించనున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయించాలని గద్వాల సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు ఎంపీ మల్లురవిని కోరారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయనను కలిసి సమస్యను వివరించారు. బాధిత రైతులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులపై దాడులు చేయించిన ఫ్యాక్టరీ యాజమాన్యం, తిరిగి వారిపైనే కేసులు నమోదు చేయించడం తీవ్ర విషయమన్నారు. రైతులపై కేసులను ఎత్తివేయించి, పరిశ్రమ అనుమతులను రద్దు చేసేఅ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అలాగే జిల్లాలో నూతన మండలాల ఏర్పాటు, ఐటీఐ కళాశాల నిర్మాణం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని 99, 100వ ప్యాకేజీ పనులను పూర్తికి సహకరించాలని కోరారు. జిల్లాలో విద్య వైద్య రంగాల అభివృద్ధి, గద్వాల కోట పరిరక్షణ, రైల్వే స్థలం సద్వినియోగం, స్మృతివనం అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ రెడ్డి, రాఘవ రెడ్డి, నగేశ్, శ్రీనివాసరెడ్డి, రాజు, దేవేందర్ రెడ్డి, తిమ్మప్ప, లక్ష్మన్న, వెంకటాచారి, గోవిందాచారి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

## రాంగ్‌రూటులో రుణం


» జింకలపల్లి గ్రామ ఐక్య సంఘంలో గందరగోళం
» సభ్యులకు తెలియకుండా రూ.1.50 తీసుకున్న వీవోఏ


ఉమ్మడి ఇటిక్యాల మండల ఐకేపీ కార్యాలయం

ఎర్రవల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘం సభ్యులకు ఇవ్వాల్సిన రుణాన్ని నిబంధనలకు విరుద్ధంగా వీవోఏ తీసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లికి చెందిన ఇందిర మహిళా సంఘానికి సామాజిక పెట్టుబడి (సీఐఎఫ్) నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఆ డబ్బును సంఘం సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, వీవోఏ రాధమ్మ తీసుకున్నది. తమ సంతకాలను ఫోర్జరీ చేసి ఆమె రుణం తీసుకున్నట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. అందుకు గ్రామ ఐక్య మహిళా సంఘం అధ్యక్షురాలు తులసమ్మ సహకారం ఉన్నట్లు చెప్తున్నారు. నిబంధనల ప్రకారం సంఘం సభ్యులకు రుణం కావాలంటే వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దానిని వీవోఏ మండల మహిళ సమాఖ్యకు పంపించాలి. మంజూరైన తర్వాత ఆ నగదును నేరుగా సభ్యురాలి ఖాతాలో జమ చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా వీవోఏ రూ.1.50 లక్షల రుణం తీసుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై ఏపీఎం కురుమన్నను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## తాగునీటి కోసం తండ్లాట

» అల్లాడుతున్న మద్దిమడుగు చెంచులు


చింతమట్ల మడుగు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న చెంచు కాలనీ వాసి

పదర, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు లేక చెంచులు ఇబ్బంది పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, నల్లమల అటవీ సమీపంలోని పదర మండలంలోని మద్దిమడుగు చెంచు కాలనీలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలోని బోరు మోటారు చెడిపోవడంతో తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీ చెంచులు గ్రామానికి కొంత దూరంలో ఉన్న చింతమట్ల మడుగు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆ నీరు పరిశుభ్రంగా లేకపోవడంతో వ్యాధుల భారిన పడ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వెంకటయ్యను సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా, ఆయన లిఫ్ట్ చేయడం లేదు.

న్యూస్ బాక్స్

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పెబ్బేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగా వ్యతిరేక ఈడబ్ల్యూఎస్ రిజర్వేషను రద్దు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ ఈరపాగ గోవిందు డిమాండ్ చేశారు. కేఏఎన్‌పీఎస్ 2వ రాష్ట్ర మహాసభ కరపత్రాలను బుధవారం విడుదల చేసి మాట్లాడారు. 13న మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ హాల్లో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సావిత్రీబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు చైతన్య భారతి, ఈరపాగ సైదమ్మ, రాజు, లక్ష్మీ, చెన్నమ్మ తదితరులున్నారు.

## జీతాలు ఇవ్వాలని కార్మికుల ధర్నా

రేవల్లి, జూలై 9, (ఆంధ్రజ్యోతి) : మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని ఇది నాలుగో నెల గడుస్తున్నా మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు బుధవారం రేవల్లి మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు రాక పూట గడవడం కష్టంగా ఉందని, వెంటనే మాకు జీతాలు అందజేయాలని ఆయా గ్రామస్థులు, కార్మికులు కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

పెబ్బేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి పిలుపునిచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాకు వెళ్తున్న సందర్భంగా బుధవారం పెబ్బేరు జాతీయ రహదారి వద్ద జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వంగా కలిశారు. స్థానిక ఎన్నికల అంశాలపై కాంగ్రెస్ నాయకులకు పలు సూచనలు చేశారు. వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రామన్ గౌడ్, మోతే రాములు, ఆంజనేయులు, యుగేందర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, కృష్ణ తదితరులున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అమరచింత, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన రూ.52 వేల చెక్కును అమరచింతకు చెందిన కావలి బుచ్చన్నకు బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజా సంక్షమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. అరుణ్ కుమార్, తౌఫిక్, శ్యామ్ పాల్గొన్నారు.

## వంట సామగ్రి వితరణ

పెద్దమందడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బలిజపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-09 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే వంట సామగ్రిని బుధవారం పాఠశాల ఉపాధ్యాయుల బృందానికి అందజేశారు. పాత్రలు, బేసన్లు, బకెట్స్, గరిటలు పాఠశాలకు వితరణ చేశారు.

## అమృత్ పథకాన్ని చేపట్టాలి

కొత్తకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ పథకాన్ని వెంటనే చేపట్టాలని బీజేపీ నాయకులు బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోకన్వీనర్ హరత్ భూషణ్ మాట్లాడుతూ.. 2023లో కేంద్ర ప్రభుత్వం కొత్తకోటకు రూ.14.95 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, నవీన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్'


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాకం శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీడబ్ల్యూవో సుధారాణికి వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కుశ కుమార్ అధ్యక్షతన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్ బకాయిలతో సహా చెల్లించాలన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తున్న నేటికి అర్హులైన ఆసరా పెన్షన్‌దారులకు ఇచ్చిన మాట నిలుపుకోవడం లేదన్నారు. ఇప్పటికైన మాట నిలుపుకోవాలని, లేదంటే ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆగస్టు 13న దివ్యాంగులు, ఆసరా పెన్షన్ దారులతో కలిసి తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం గట్టయ్య, కొమ్ము చెన్నకేశవులు, గంధం కృష్ణయ్య, గంధం లక్ష్మయ్య, భీమ్ ప్రభాకర్‌శెట్టి, గోపీనాథ్, మీసాల నాగరాజు, నాగశేషి, చంద్రయ్య, వర్మ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం పాఠశాల.. సమస్యలకు నిలయం

- పాఠశాల ఆవరణలో మందుబాబుల ఆగడాలు
- శిథిలావస్థలో వంటగది
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

వీపనగండ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనేక సమస్యలు నెలకొన్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట ఏజెన్సీ మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం మందుబాబుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. ఏడుగురు ఉపాధ్యాయులకు గాను అయిదుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఆ సబ్జెక్టులో విద్యార్థులు ప్రావీణ్యం సాధించలేకపోతున్నారు. కొన్ని పాఠశాలలో గ్రౌండ్ లేక విద్యార్థులు


పైకప్పు లేని వంటగది


ప్రహరీ లేని బొల్లారం పాఠశాల

ఆటలకు దూరమవుతుంటే బొల్లారం పాఠశాలలో విశాలమైన మైదానం ఉన్నా.. ఆటలు ఆడిపించేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోవడంతో క్రీడల్లో వెనుకబడి పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట గది పైకప్పు రేకులు గాలులకు ఎగిరిపోయాయి. కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. గ్రామానికి దూరంగా పాఠశాల ఉండటంతో మందుబాబులు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగుతున్నారు. పాఠశాల గదుల తలుపులు విరగొట్టడం వంటి పనులకు పాల్పడుతున్నారని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పోలీసులు గస్తీలు నిర్వహించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులు మంజూరు చేసి, కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరుతున్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పోలీసులు గస్తీ నిర్వహించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలి. సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్థులు సహకరించాలి

- రఘు, ప్రధానోపాధ్యాయుడు

### అధికారుల దృష్టికి తీసుకెళ్లి



పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

- నరసింహ, ఎంఈవో

## ప్రతీ ఒక్కరు మొక్క నాటాలి

పెద్దమందడి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ఒక మొక్క నాటి సంరక్షించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం వన మహోత్సవ సందర్భంగా పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్‌రాజు, మండల పంచాయతీ అధికారి పుష్ప, ఏపీఓ సురేస్, ఎఫ్ఎస్‌ఓ విజయ్, టెక్నికల్


మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో ఉమాదేవి

అసిస్టెంట్ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి జయరాములు కూలీలు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ వృత్తుల నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారిని ఇందిరా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ , రెజ్యూమ్ బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్ అండ్ మెంటల్ వెల్ బీయింగ్ ట్రైనింగ్ అంశాలలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో అభ్యర్థులకు ట్రావెలింగ్ అలవెన్స్, భోజన వసతి సదుపాయం కల్పిస్తారని పేర్కొన్నారు. 12వ తేదీ లోపు టీజీవోబీఎంఎం ఎస్.సీజీఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సమర్పించి, వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## మాజీ ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు ఎమ్మెల్యేకు తగవు

కొత్తకోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వామన్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న వామన్‌గౌడ్

అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డితో కలిసి విలేఖరులతో మాట్లాడారు. దేవరకద్ర ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేసినట్లుగానే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యేపై విమర్శలు చేశారన్నారు. దాన్ని తట్టుకోలేని ఎమ్మెల్యే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల హామీలపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశంలో శ్రీనివాసులు, అయ్యన్న, విజేందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాములు యాదవ్, నాగేష్, నరోత్తంరెడ్డి, రవీందర్‌రెడ్డి. ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌జి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి వాసులకు ప్రతిభా పురస్కారాలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తికి చెందిన ప్రముఖ నవల రచయిత్రి పాల్కంపల్లి శాంతాదేవి, శిల్పి సాహితీవేత్త వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్‌లకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభా పురస్కారాలు ప్రకటించడంపై సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. వీరికి పురస్కారాలు ప్రకటించడం అభినందనీయ మని సాహితీ వేత్తలు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కందూరు నారాయణరెడ్డి, జనజ్వాల, సూర చంద్రశేఖర్, గోపినాథ్, గంధం నాగరాజు, డా.శ్యాం సుందర్, బండారు శ్రీనివాస్, దేశి రాములు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రి పరామర్శ

ఖిల్లాఘణపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊరు అంచుతండాకు చెందిన బద్య నాయక్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. బద్య నాయక్‌కు మనోధైర్యం కల్పించారు. ఆసుపత్రి వైద్యులతో మాజీ మంత్రి మాట్లాడుతూ... మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట సోమ్లా నాయక్ తదితరులు ఉన్నారు.

## అంబులెన్స్‌లో కాన్పు

వీపనగండ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన జ్యోతి బుధవారం అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు కోసమని ఆసుపత్రికి అంబులెన్స్‌లో బయలుదేరగా.. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమవగా.. అంబులెన్స్ సిబ్బంది కాన్పు చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలియజేశారు.

## చేప పిల్లలు వద్దు నగదు ఇవ్వాలి

మదనాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు చేప పిల్లల బదులు నగదు బదిలీ చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మొగిలి అన్నారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయంపై రిజిస్టర్ పోస్టు చేశారు. సత్యనారాయణ, బాలకృష్ణ, రాజకుమార్, పరమేష్, మొగలన్న, శివ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి


మాట్లాడుతున్న గోవింద్ నాయక్

వనపర్తి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఉద్యాన శాఖ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని నాగవరం రైతు వేదికలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 2025 సంవత్సరానికి 2500 ఎకరాల ఆయిల్ పామ్ రైతులను గుర్తించాలని కోరారు.

# చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి


కేడీఆర్ కళాశాలలోని లైబ్రరీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి

వనపర్తి విద్యావిభాగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలోని చారిత్రాత్మకమైన కృష్ణదేవరాయల భవనానికి మరమ్మతులు చేయించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వనపర్తి ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం పట్టణంలోని (కృష్ణ దేవరాయ భవనం) కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఆమె సందర్శించారు. చారిత్రాత్మక కట్టడాన్ని పరిశీలించిన కలెక్టర్ చాలా అద్భుతంగా ఉందన్నారు. ఇంత మంచి చారిత్రాత్మక కట్టడాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవనం మొత్తం శుభ్రం చేయకుండా నిర్వహణ గాలికి వదిలేయడం సరికాదని, మొత్తం భవనం శుభ్రం చేయించాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాల లైబ్రరీ, తరగతి గదులు, మెట్ల బావిని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పరిశీలించారు.

## విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

రేవల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రవాణాకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వమే వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బుధవారం తహసీల్దార్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఎల్లస్వామి మాట్లాడుతూ మన రాష్ట్రంలో దాదాపు 60 శాతం విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక పాఠశాలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లస్వామి, కురుమన్న, శ్రీను, సుల్తాన్, దేవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## నకిలీ విత్తనాలు అమ్మితే ఫిర్యాదు చేయాలి

వనపర్తి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు రసీదులను తీసుకోవాలని కల్తీ విత్తనాలతో పంట సరిగ్గా పండనప్పుడు కన్స్యూమర్ కోర్టులో ఫిర్యాదు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని



సదస్సులో మాట్లాడుతున్న రజిని

అన్నారు. బుధవారం వనపర్తి మండలంలోని కాశీంనగర్ గ్రామంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయపరమైన సహాయం, సలహాల కోసం కమిటీలో ఉన్న ప్యానల్ లాయర్లు తిరుపతయ్య, ఎండి నిరంజన్ బాబా, పారా లీగల్ వలంటీర్లు శివ ప్రసాద్, రవీందర్ లను సంప్రదించాలని సూచించారు. పుష్పలత, శివ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

మదనాపురం జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో నీళ్లు ఉండి కురుమూర్తి ఎత్తిపోతల పథకంను మూడు సంవత్సరాల పాటు నడిపించుకోలేక మూలకు పడేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వరుసగా మూడుసార్లు నీళ్లు ఇవ్వడమే గాక యాసంగిలో చివరి తడికి నీరు సరిపోకుంటే


విలేకరులతో మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

ఎమ్మెల్యే జీ.ఎం.ఆర్ సీఎంతో మాట్లాడి ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయించారన్నారు. కార్యక్రమంలో మహేష్‌కుమార్, శరత్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వడ్డె కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న నిర్వహించనున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి సీసీఎల్ఏ లోకేష్ కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. వనపర్తి జిల్లా నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... జూలై 15వ తేదీ లోపు పరీక్ష కేంద్రం వివరాలు సిద్ధం చేసి సీసీఎల్ఏ కు పంపాలని సూచించారు. వనపర్తి జిల్లాలో మొదటి దశ లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు 112 మందిని కేటాయించడం జరిగిందని చెప్పారు.

27వ తేదీన వీరికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు థియరీ పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించి పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమావేశంలో ఏడి సర్వేయర్ బాలకృష్ణ, ఏవో భాను ప్రకాష్ , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయడం బాధ్యతగా భావించాలి

- ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

వనపర్తి విద్యావిభాగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో నేడు జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తిలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో విద్యార్థులతో ఏబీవీపీ ప్రారంభమై నేడు ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడిందన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతుందన్నారు. జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల, జ్ఞానేశ్వర్, సిద్ధు, శశాంక్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట : విద్యార్థుల సమస్యల పై ఏబీవీపీ అండగా ఉంటుందాని జిల్లా హిందూ వాహిని అధ్యక్షుడు అరుణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాల ఎదుట విద్యార్థులు ర్యాలీతో వచ్చి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు.

ఆత్మకూరు : మాతృభూమికి సేవ చేయడం ప్రతీ విద్యార్థి బాధ్యతగా భావించి విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఏబీవీపీ పూర్వ కార్యకర్త జగదీష్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ర్యాలీ నిర్వహించారు.

కొత్తకోట : పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా చౌరస్తాకు చేరుకోగా... ఏబీవీపీ జెండాను జిల్లా నాయకులు అజయ్ కుమార్ ఆవిష్కరించారు.


వనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

దస్తగిరి, పవన్, శివ, శంకర్ పాల్గొన్నారు.

పాన్‌గల్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏబీవీపీ అని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంకల గట్టయ్య అన్నారు. ఏబీవీపీ జెండా ఆవిష్కరించారు.

అమరచింత : అమరచింత బస్టాండ్ సెంటర్లో ఏబీవీపీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు మహంకాళి రాజేష్ మాట్లాడారు. విద్యార్థి శక్తి జాతీ శక్తి అనే నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు. జ్ఞానం, శీలం, ఏకత ఏబీవీపీ లక్ష్యమన్నారు. సత్యనారాయణ, సిద్ధ రాములు, శ్రీనివాసులు, రాజేష్, వినోద్ కుమార్, సతీష్, చంద్రు పాల్గొన్నారు.


కొత్తకోటలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

# కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఆత్మకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంలో కార్మికులు, నిరుద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా బుధవారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, , ఏఐకేఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులతో కలిసి పట్టణ పురవీధుల వెంట చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు ప్రసాద్, ఎస్.రాజు, రాబర్ట్, భరత్ మాట్లాడారు. రైతులు ఉత్పత్తి చేసే పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం లేకుండా చేసే కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌ల కిందికి తీసుకొచ్చి కార్మికవర్గానికి కనీస హక్కులు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు. తక్షణమే కార్మికులు, కర్షకులు నిరుద్యోగులు , మేధావులు ఐక్యమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడితేనే తమ హక్కులు సాధించుకోవడం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు శ్రీహరి, మహమూద్, లక్ష్మి నారాయణ శెట్టి రమేష్, అంగన్‌వాడీ, ఆశా, ఆర్‌పీ, గ్రామ పంచాయతీ వర్కర్స్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



పాన్‌గల్ బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

### ప్రైవేటీకరణ ఆపాలి

పాన్‌గల్ : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం దేశ వ్యాప్త సమ్మె సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశం రాము అధ్యక్షతన సమ్మె నిర్వహించారు.

పెబ్బేరు / కొత్తకోట : మండలంలోని తాపీ కార్మికులు ద్విచక్రవాహన ర్యాలీ, మునిసిపల్, గ్రామ పంచాయతీ, ఆశా, అంగన్‌వాడీ, హమాలీ కార్మికులు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టి. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, వెంకటయ్య, నాగరాజు, వెంకటేషు, శాంతన్న, కృపయ్య, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీపనగండ్లలో కార్మికుల ర్యాలీ

వీపనగండ్ల : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి పాత బ్యాంకు కూడలిలో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. బాల్‌రెడ్డి, బాలగౌడ్, మహబూబ్ బాషా, ఆశన్న పాల్గొన్నారు.

గోపాల్‌పేట : కార్మికులకు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ అన్నారు. బుధవారం ఏదుల మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు ప్రజలు కలిసి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. రమేష్, భగవంతు, ఈశ్వర్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సమ్మెను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకట్‌రాములు, శారద, కార్మికులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిర్వహిస్తున్న ర్యాలీ